# ఉపన్యాస ధోరణి

ఒక నలభై నిమిషాలు ఏదైనా ఒక్క విషయాన్ని గురించి మాట్లాడటం కష్టమైనపని. కొంతమందికి ఇందులో అలవాటు ఉంటుంది. అల్లాంటి వాళ్ళకు అదేమిరా కష్టం అనిపించదు కాని, శ్రోతవాళ్ళకు బాధే.

అసలు ఉపన్యాసం ప్రారంభించటంలో ఉంది అవస్థ అంతా. "నన్ను ఈ రోజున ఉపన్యాసం ఇయ్యటానికి మీరు పిలిచారు. ఇందుకు నేను ఎంతమాత్రం అర్హుడ్ని కాదు అల్పజ్ఞుడ్ని, చేతకానివాడిని, పనికిమాలిన వాడిని" అంటూ ప్రారంభిస్తారు కొందరు. నీసత్తా అంతంత మాత్రమేనని తెలిసికూడా ఎందుకు ఒప్పుకొన్నావయ్యా ఈపనికి ? పిలిచారు కాబట్టి వచ్చాను అనటానికి ఇదేమన్నా విందుభోజనమా ? అని అనాలని అనిపిస్తుంది అల్లాంటిమాటలు వింటూ ఉంటే. ఇల్లా మనము అనుకొంటామని ఊహించి కొందరు "నేను సభారంజకంగా మాట్లాడలేనని తెలిసికూడా, నన్ను మీరు ఇక్కడికి రప్పించటం మీదేతప్పు" అని తప్పు అంతా మనమీదె పారేస్తారు గడుసు తనంగా.

ఇప్పుడు చెప్పిన రెండు పద్ధతులూకూడా కాస్త అరితేరిన వాళ్ళధోరణే. బొత్తిగా క్రొత్తవాళ్ళకు ఇంతవరకు కూడా నడవదు. అధ్యక్షా అన్న దగ్గరే ఆగిపోతుంది.

వేదిక ఎక్కిన ప్రతి ఉపన్యాసకుడూ అధ్యక్షా అని ఒక కేక వేస్తాడు ముందు. అది ఎందుకూ అని ఒక ప్రశ్న.

అధ్యక్షుడు విస్తారం మాట్లాడడు. ఉపన్యాసకులు మాట్లాడేదంతా వింటూ ఉండాలె ఇష్టంఉన్నా లేకపోయినా. కదలకుండా మెదలకుండా చాలాసేపు కూర్చోటం కష్టం. ఎంత గట్టి గుండె కలవాడికైనా కునికిపాట్లు రాక మానవు. కాస్త నిద్రమత్తులో పడతాడు. అందుకని ఉపన్యాస వేదికపై ఎక్కిన ప్రతివ్యక్తీ, అధ్యక్షా అని ఓ సుమారైన కేక వేయటంవల్ల ఆయన ఉలిక్కిపడి లేవటానికి చాలా అవకాశం ఉంది. దీర్ఘమైన ఉపన్యాసాలు వినసూ లేకా, వెళ్ళిపోనూ లేక శ్రోతలు కూడా ఒకప్పుడు ఇదే అవస్థలో ఉంటారు. అందుకని "సోదర సోదరీమణులారా అని మరోచిన్న కేక వేయటం కూడా అవసరం అయింది ఈ రోజుల్లో.

ఆ కాస్త మాటా అన్నతరువాత ఇక ఉపన్యాసం ప్రారంభించాలె. క్రొత్తవాడికి అక్కడేఉంది అవస్థ అంతా. నోట మాటరాదు. వచ్చినా తడబడుతుంది. నత్తివస్తుంది. ఒకమాట అనబోయి మరోమాట అంటాడు. ఒకాయన ఉపన్యాసం ప్రారంభించి "సామెతలు తెలుగునుడికారానికి నిలయాలు" అని అనాలని అనుకొన్నాడు. మొదట్లోనే భయంతో వణికిపోయి తెలుగు నుడికారానికి అన్నాడు. సభ్యులు మర్యాద తెలిసినవాళ్ళు కాబట్టి, ఆతని అవస్థ గ్రహించి, ఆ వాక్యాన్ని చిరునవ్వుతో ఆహ్వానించారు. ఆయనమటుకు సభవంక చూడలేక పోయినాడు. సిగ్గుపడి చప్పున తప్పు దిద్దుకోవాలె నన్న ప్రయత్నంలో, తెలుగు

నుడికారానికి అనేశాడు చెబుతున్న రెండోసారి, అక్కడి వాళ్ళంతా కొద్ది కొద్దిగా ముసిముసి నవ్వులు నవ్వుకొన్నారు. ఆయనకు వచ్చిన చావైంది. క్రుంగిపోయినాడు. తల తిరుగుతున్నట్లు తోచింది. అప్పటికీ ధైర్యం చేసి, పెద్దగా గొంతెత్తి సామెతలు తెలుగు ఖారంపోడికి నిలయాలు అన్నాడు. శ్రోతలంతా ఇక ఆపుకోలేక గొల్లుమన్నారు

ఆరితేరిన వారికికూడా ఉపన్యాసా లివ్వటం అంత సులభమైన పని కాదు. మాట్లాడుతూఉంటే మధ్యలో, ఎవరో ఒకరు లేచి, ఏదో ఒక అడ్డుప్రశ్న వేస్తారు. దాంతో ఉపన్యాసధోరణి తెగిపోతుంది. మనిషి గాభరా పడతాడు. చాలాచికాకు కలుగుతుంది.

రెడ్డిగారు వచ్చిన సందర్భంలో మా వూళ్ళో ఒకసభ జరిగింది. శాస్త్రిగారు పోతన చిత్రాన్ని గురించి మాట్లాడుతూ నాగయ్యగారు ఆ పోతన పాత్రకు ఒక విధంగా తగి ఉండలేదని చెప్పారు. ఎందుచేతా అంటే; పోతన పరమ భక్తుడు. భక్తుడు సాధారణంగా కృశించి ఉంటాడు. మేధాశక్తి, ఆధ్యాత్మిక బుద్ధి పెరిగితే, దేహం క్షీణిస్తుంది అంటూ ఏదో చెప్పారు. దానికి రెడ్డిగారు సమాధానం చెప్పారు.

ఆధ్యాత్మికంగా వృద్ధి అయితే శారీరకంగా విధిగా నీరసించి ఉండనక్కరలేదు; అని మొదటి ఆయన వాదాన్ని, ఖండిస్తూఉన్న సమయంలో, నేను లేచి పెద్దగా అన్నాను. అల్లాగ కాదండీ, పోతన తప్పకుండా సన్నగా పల్చగా, రేప

రెపలాడిస్తూ ఉండి ఉంటాడు ఎంచేతా అంటే, ఆయన ఒక చోట లా వొక్కింతయు లేదు అన్నాడు. అంతా నవ్వారు. రెడ్డిగారు చాలా చికాకు పడ్డారు. ఇల్లాంటి ఎగుడు దిగుడు మాటలు వచ్చినప్పుడు, తిప్పికొట్టి గొడ్డలి పెట్టులాంటి జవాబు చెప్పగలిగినవాళ్ళూ ఉన్నారు. కాని అల్లాంటి నిశితమైన మేధాశక్తి అందరికీ ఉండదు.

ఉపన్యాసకుడు ఒక్కొక్కప్పుడు, ఏదో విషయం జ్ఞాపకం రాక అధ్యక్షుణ్ణి ఏదో ప్రశ్న వేస్తూ ఉండటంకూడా ఉంటుంది. ఒకసారి నేను నక్కలతోటలో ఉపన్యాసం ఇస్తున్నాను ఏదో సందర్భంలో నరకలోకం విషయమై ప్రశంస వచ్చింది. నరకానికి అధిపతి ఎవ్వరైంది జ్ఞాపకం రాక కాసేపు అవస్థపడి చివ్వరకు అధ్యక్షునివైపు తిరిగి నరకానికి అధిపతి ఎవరండీ అని అడిగాను. అంతకుముందు నేను అన్న ఏదో ఒక మాటను పురస్కరించుకొని ఆయన నవ్వుతూ ఉండటం మూలాన వెంటనే జవాబు చెప్పలేదు. నేను జవాబుకోసం ఆయన ముఖం వంక చూస్తూ, నిరీక్షిస్తున్నాను. ఇంతలో సభలోనుంచి ఒకాయన "గగ్గయ్య" అని ఫెడేల్న కేక పెట్టాడు. ఇక అక్కడ ఉన్నవాళ్ళంతా విరగబడి నవ్వారు. నా ఉపన్యాసధోరణి కపీమని తెగిపోయింది. ఏమీ తోచ లేదు. అసలు నేను అక్కడ ఉపన్యాసం ఇస్తున్నాను అనే సంగతే మరిచిపోయి, మామూలు జీవితంలో క్లాసులో కుర్ర వాళ్ళు అల్లరిచేస్తే, విసుక్కునే పద్ధతిలో చికాకుపడి తప్పు

కూర్చో, నిల్చో, అని స్కూలు మాస్టరీ పద్ధతిలో అనేసరికి మళ్ళీ అంతా నవ్వారు. ఇక ఆ తరువాత ఉపన్యాసం ఎల్లాగ నడిచిందో నాకు జ్ఞాపకంలేదు.

మరోసారి నేను స్కూలులో క్లాసులో మాట్లాడుతూ కుర్రవాళ్ళకు సాహిత్యంయందు అభిరుచి కలిగేందుకు కొన్ని విషయాలు చెబుతున్నాను. కొందరి కవులపేర్లు చెప్పి, స్త్రీలుకూడా పూర్వకాలంలో కవిత్వం చెప్పేవాళ్ళు అని, అప్పటిదాకా ఎందుకు, ఇప్పుడూ ఉన్నారు ఆడవాళ్ళల్లో కవిత్వం చెప్పగలవాళ్ళు అని కూడా చెప్పి ఆధునిక కవయిత్రి అయిన ఒక్క ఆమె పేరు చెప్పండీ మీలో ఎవరైనా అన్నాను. ఎవ్వరూ మాట్లాడలేదు. ఒక కుర్రవాడు మటుకు ధైర్యంగాలేచి నుంచుని కన్నాంబ—అండీ అని కేక పెట్టాడు.

కొన్ని సమయాలలో ఉపన్యాసకుడు సభ్యులలో ఒకరిని ఏడిపించబోయి తానే గాఢమైన దెబ్బ తింటూ ఉంటాడు ఒకాయన ఎన్నికల సందర్భంలో ఒక గంభీరమైన ఉపన్యాసం ఇస్తున్నాడు. ఆయన తన పార్టీనిగురించి లేనిపోని గొప్పతనం తెచ్చిపెట్టుకొని మాట్లాడటం జూచి, ఒకాయన అసహ్యించుకొని ఉపన్యాసకుడిపై తిరగబడి ఏవో అడ్డుదిడ్డు ప్రశ్నలు వేయటం సాగించాడు. ఇదేమూ అనుకొన్న ఇంకో వ్యక్తి, ఆ ప్రశ్నలు వేస్తున్న ఆయనతో, ఏమిటా వెధవప్రశ్నలూ నీవూనూ! గాడిదలాగున్నావు! ఇంతమాత్రం జ్ఞానంలేదేం అని కోప్పడ్డాడు. దానిమీద కొద్దిగా గల్లంతు బయలుదేరింది—

ఈయన, ఆయన్ను గాడిద అనటం బాగుండలేదని కొందరూ, ఆయన అల్లాగ ఎగుడుదిగుడు ప్రశ్నలు వేయటం అసలే బాగుండలేదని మరి కొందరూ అన్నారు. మొత్తంమీద వాళ్ళు ఇద్దరి పోట్లాటా సాగుతూనేఉంది. నీవు గాడిదవంటే, నీవు గాడిదవని తిట్టుకొంటున్నారు. ఒక మూలగా కూర్చుని ఉన్న ఒక ముసలాయన ఇదంతా చూచి, చికాకు పడి, చాల్లే బాగానే ఉంది. ఇహ ఊరుకోండి. మీ రిద్దరూ గాడిదలే అన్నాడు. అప్పటికీ ఇంకా గొడవగానే ఉండటంచూచి, ఈ గొడవ చేస్తున్న వాళ్ళందరిమీదా, ఒక్క విసురు విసురుదామని పెద్ద గొంతుకతో—ఇక్కడ చాలా గొడవగాఉంది. ఒక్కొక్కడే మాట్లాడితే శాస్త్రనయం. ఉన్నగాడిదలన్నీ ఒక్కసారే అరిస్తే చాలాచికాగ్గా ఉంటుంది అన్నాడు. "అయితే ముందు మీరు కానీయండి" అన్నాడు వేదికకు దగ్గరలో కూర్చున్న ఒకయువకుడు. అంతటితో ఆ సభ ఆగిపోయింది.